
నీటి పరీక్ష కిట్ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

# మిషన్ భగీరథ నీటిపై ప్రజల్లో నమ్మకం పెంచాలి

**ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే :** ప్రతి ఒక్కరూ మిషన్ భగీరథ నీరు తాగేలా నమ్మకం పెంచాలని, ప్రజలకు సురక్షిత నీరు అందించడం మన బాధ్యత అని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. నెలలో మూడు సార్లు అనగా. . మొదటి రోజు, 11వ రోజు, 22వ రోజు క్రమం తప్పకుండా ట్యాంకులను శుభ్రం చేసి, క్లోరినేషన్ పరీక్షల వివరాలు నమోదు చేయాలన్నారు. పరీక్షలు నమోదు చేసిన ఆ రిజిస్టర్‌లో స్థానిక గ్రామస్థుల సంతకాలు తీసుకోవడం వల్ల వారిలో భగీరథ నీరు సురక్షితంగా ఉంటుందన్న నమ్మకం పెరుగుతుందన్నారు. నీటి పరీక్షల కిట్లను చూపిస్తూ.. వాటిని ఎలా వినియోగించాలో పాలనాధికారి సమక్షంలో అధికారులు వివరించారు. మిషన్ భగీరథ జిల్లా అధికారి సురేష్, ఎంపీడీవో నాగేశ్వర్, అధికారులు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

### పరిశుభ్రంగా ఉంచాలి..

**ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే :** బంగారుగూడ డంపింగ్ యార్డులోని జంతు సంరక్షణ కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షిషా మంగళవారం పరిశీలించారు. కేంద్రంలోని రోజువారి కార్యక్రమ రిజిస్టరు, రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. కేంద్రంలోని పరిసరాలు, శస్త్రచికిత్స చేసిన కుక్కలను పరిశీలనలో ఉంచి చికిత్స అందించే గదులను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. పురపాలక కమిషనర్ ఖమర్ అహ్మద్, పశువైద్యులు సురేష్, దూద్‌రాం, శ్రీకాంత్, సుదేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, పారిశుద్ధ్య అధికారులు, పాల్గొన్నారు.


ఈనాడు ఆదిలాబాద్

బుధవారం సెప్టెంబరు 25, 2024




# స్థలం కొనేముందు.. అప్రమత్తతే మందు


నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని ఇటీవల నస్పూర్‌కు చెందిన దీకొండ అన్నయ్యకు చెందిన ఇంటిని ఒక సర్వే నంబరులో భూమి కొని మరో సర్వే నంబరులో నిర్మించారనే కారణంతో మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. అయితే నిబంధనల ప్రకారమే ఇంటి నిర్మాణం చేపట్టానని బాధితుడి ఆరోపణ. భూమి కొనుగోలు సమయంలో అప్రమత్తంగా ఉంటే ఇలా జరిగి ఉండేది కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



దండేపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన హరినాయక్‌ను భూమి పట్టాదారుల ఫోర్జరీ సంతకాలతో పట్టా చేయించుకున్నాడని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే పట్టాదారు సంతకాలతో కొన్నేళ్ల క్రితమే పట్టా జరిగిందని హరినాయక్ వాదన. సరైన జాగ్రత్తలు పాటిస్తే బాగుండేదని అధికారులు సూచిస్తున్నారు. పైన పేర్కొన్నవి ఒక్క జిల్లాలోనే కాదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇలాంటి ఘటనలు ఇటీవల తరచూ చోటు చేసుకుంటున్నాయి.

దండేపల్లి గ్రామీణం, లక్సెట్టిపేట, న్యూస్‌టుడే

స్థలం కొనుగోలు చేసేప్పుడు సరైన జాగ్రత్తలు పాటించకపోవడం, పత్రాలు సరిగ్గా చూసుకోకపోవడంతో భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉంటాయి. అధికారులు తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. దీంతో పాటు స్థలాన్ని నష్టపోయే అవకాశాలున్నాయి. ఇటీవల రాజధానిలో హైడ్రా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను కూల్చివేస్తోంది. జిల్లాల్లోనూ ప్రజల్లో భూముల కొనుగోళ్లపై సవాలక్ష అనుమానాలు తలెత్తుతున్నాయి. భూమి కొనుగోలు చేసేటప్పుడు వాటి పట్టా, రిజిస్ట్రేషన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పట్టా అయిన తర్వాత దాన్ని కాపాడుకునే విధానాలపై విశ్రాంత కలెక్టర్ శర్మన్‌నాయక్, సబ్‌రిజిస్ట్రార్‌ల సూచనలు, సలహాలు ఇచ్చారు.






ఇక్కడ కనిపిస్తున్న చిత్రం జీపీఎస్ మ్యాప్ కెమెరా యాప్ ద్వారా చిత్రీకరించింది. మనం కొనుగోలు చేసిన ప్రదేశాన్ని గుర్తించడానికి ఇది తోడ్పడుతుంది. భూమి వద్దకు వెళ్లి ఫొటో తీయడం ద్వారా మనం ఉన్న ప్రదేశం అక్షాంశాలు, రేఖాంశాలు, సర్వే నెంబరు, లేదా ప్లాటు నెంబరు మనకు కనిపిస్తుంది. దాన్ని చిత్రీకరించడం ద్వారా ఫొటోపై వివరాలు నమోదవుతాయి.

### ప్రభుత్వ స్థలమా, పట్టానా చూసుకోవాలి



- భూమి కొనుగోలు చేసే సమయంలో ప్రభుత్వ స్థలమా, పట్టానా అనేది మొదటగా చూసుకోవాలి.
- తహసీల్దార్ కార్యాలయంలో కొనుగోలు భూమికి సంబంధించి రికార్డులు, పహాణీలను సరిచూడాలి.
- భూమి విక్రయించే వ్యక్తిపైనే పట్టా ఉందా, మనం కొనుగోలు చేసే భూమి అతడికి సంబంధించినదేనా అనేది పరిశీలించాలి.
- కొనుగోలు చేసిన భూమి, పట్టా భూమి ఒకటేనా అనే దానిపై సర్వే నంబర్లను పోల్చి చూడాలి.
- మొదటగా 15 ఏళ్ల క్రితం పహాణీలు, విక్రయదారునికి భూమి ఎలా వచ్చింది, వారసత్వమా, కొనుగోలా వంటివి జాగ్రత్తగా చూసుకోవాలి.
- కొనుగోలు తర్వాత హద్దురాళ్లు ఏర్పాటు చేసుకోవాలి.

**శర్మన్‌నాయక్ విశ్రాంత కలెక్టర్**

### కొనుగోలు సమయంలో సరిచూసుకోవాలి



- భూమి క్రయ, విక్రయాల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత కొనుగోలుదారునిదే.
- లింకు డాక్యుమెంట్లు లేకుండా భూమి కొనుగోలు చేయడం సరికాదు.
- భూమి కొనుగోలు చేసే సమయంలో సర్వే నెంబరు, లోకేషన్, హద్దులు కచ్చితంగా చూసుకోవాలి.
- భూమికి నాలుగువైపులా ఉన్న యజమానులను విచారించడం ద్వారా మోసపోకుండా ఉండేందుకు అవకాశం ఉంటుంది.
- కొనుగోలు చేసే ముందు ఇ.సి. ద్వారా భూమిపై లావాదేవీలు తెలుసుకోవచ్చు.
- ఓపెన్ ప్లాట్లకు డీటీసీపీ అనుమతి ఉందా లేదా తెలుసుకోవాలి. ఇంటి రిజిస్ట్రేషన్ సమయంలో నిర్మాణ అనుమతి పత్రం, టీఎస్‌బీపాస్ నుంచి అనుమతులు తీసుకున్న పత్రం సరిచూసుకోవాలి.
- చెరువు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో భూమి ఉందా తెలుసుకోవడానికి నీటిపారుదలశాఖ, రెవెన్యూ శాఖల ద్వారా వివరాలు పొందవచ్చు.
- డబుల్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డ్యాక్యుమెంటు ఆధారంగా సరి చూసుకునే వెసులుబాటు ఉంది.
- తాజాగా ఐజీఆర్ఎస్-తెలంగాణ పోర్టల్ ద్వారా భూమి స్వభావాన్ని తెలుసుకునే వీలు ప్రభుత్వం కల్పించింది.

**జి.సాయికుమార్, సబ్ రిజిస్ట్రార్, లక్సెట్టిపేట**

# నోడల్ అధికారులే ఇక ఎంఈవోలు

● ఏళ్ల తర్వాత ప్రభుత్వ నిర్ణయం

**పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే :** నాలుగైదు మండలాలకు ఒక్కరే ఎంఈవోగా పని చేస్తున్న విధానానికి ప్రభుత్వం ఎట్టకేలకు స్వస్తి పలికింది. నోడల్ అధికారులుగా ఉన్న సీనియర్ హెచ్ఎంలకే మండల విద్యాధికారులుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో దాదాపు 19 ఏళ్లుగా నెలకొన్న వివాదానికి తెర పడినట్లయ్యింది. జిల్లాలో ప్రస్తుతం ఒక రెగ్యులర్ ఎంఈవోతో పాటు మరో నలుగురు పీజీ హెచ్ఎంలు 18 మండలాల బాధ్యతలు చూస్తుండగా.. తాజా చర్యలతో కొత్తగా మరో 13 మంది సీనియర్ హెచ్ఎంలు ఎంఈవోలుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఫలితంగా పర్యవేక్షణ మెరుగుపడి విద్యావ్యవస్థ గాడిలో పడే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో 2005 తర్వాత ఎంఈవోల నియామకం నిలిచిపోయింది. ఆ తర్వాత ఎంఈవో బాధ్యతలను సీనియర్లకు అప్పగించినా ఆ తర్వాత కోర్టు వివాదంతో 2011 నుంచి యథాస్థితి నెలకొనడంతో.. ఆ సమయంలో ఇన్‌ఛార్జులుగా ఎవరైతే ఉన్నారో వారే ఖాళీ అయిన మండలాలకు ఎంఈవోలుగా కొనసాగుతూ వస్తున్నారు.



**నూతన ఇన్‌ఛార్జి ఎంఈవోలు వీరే..**

| మండలం | ఎంఈవో |
|---|---|
| ఆదిలాబాద్ రూరల్ | ముజాఫర్ హుస్సేన్ |
| మావల | సరోజ |
| తలమడుగు | వెంకట్‌రావు |
| ఇచ్చోడ | కె. బిక్కు |
| సిరికొండ | పి. సునీల్ |
| నార్నూర్ | పి. అనిత |
| గాదిగూడ | ఎం. మనోహర్ |
| బజార్‌హత్నూర్ | కిషన్‌గుప్త |
| ఉట్నూరు | ఆర్. ఆశన్న |
| నేరడిగొండ | బి. భూమారెడ్డి |
| గుడిహత్నూర్ | ఆర్. ఉదయ్‌రావ్ |
| ఇంద్రవెల్లి | ఆర్. మనుకుమార్ |
| తాంసి | డి. శ్రీకాంత్ |
| జైనథ్ | బి. శ్రీనివాస్ |
| బోథ్ | ఇ. పోశెట్టి |
| భీంపూర్ | సి. శ్యాంసుందర్‌రావు |
| బేల | కోల నర్సింహులు |

# రూ. 82 లక్షలు ఖర్చు.. 18 నెలలకే పగుళ్లు


● బల్దియాలో శిథిలమవుతున్న జంతు సంరక్షణ కేంద్రం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్

బల్దియా అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు లోపిస్తున్నాయి. నాసిరకం నిర్మాణ సామగ్రి వాడటంతో ప్రజాధనం వృథా అవుతోంది. డంపింగ్‌యార్డులో నిర్మించిన జంతు సంరక్షణ కేంద్రం (వీధి కుక్కలకు సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసే భవనం) శిథిలమవుతోంది. సాధారణంగా ఓ భవనం పైకప్పు పెచ్చులూడుతోందంటే దాన్ని నిర్మించి కనీసం 50 ఏళ్లు పైబడి ఉంటుందేమో అనుకుంటాం. కానీ జంతు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించి పట్టుమని 18 నెలలే అవుతోంది. ఇంతలోనే భవనం గోడలకు బీటలు వారాయి. అత్యంత నాసిరకమైన నిర్మాణ సామగ్రి వినియోగించడంతో గోడలపై సిమెంటు ఊడిపోతోంది. సిబ్బంది వినియోగించే మరుగుదొడ్డిలో అడుగు పెట్టే పరిస్థితి లేకుండా టైల్స్ లేచిపోయాయి. కాసులు వెనకేసుకోవడమే ప్రధానంగా జరిగిన ఈ పనులలో గుత్తేదారు, అధికారులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### కమీషన్లపైనే దృష్టి..

పట్టణంలో వీధి కుక్కల బెడదను నివారించేందుకు బంగారుగూడ డంపింగ్ యార్డులో 2021లో జంతు సంరక్షణ కేంద్రం నిర్మించాలని బల్దియా యంత్రాంగం నిర్ణయించింది. ఇందుకోసం పట్టణ ప్రగతి, స్వచ్ఛ భారత్ మిషన్ పథకం కింద రూ. 82 లక్షల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు చేసేందుకు ప్రత్యేక గది, అందుకు అవసరమైన ఔషధాలు, పరికరాలు ఉంచేందుకు మరో గది, హాలు, పశువైద్యుడికి ఓ గదితో భవనం నిర్మించారు. కుక్కలకు శస్త్ర చికిత్సలు చేశాక అవి కోలుకునేందుకు సుమారు 60 చిన్న గదులతో మరో షెడ్డును నిర్మించారు. రెండేళ్లపాటు ఆగుతూ సాగిన పనులు గతేడాది మార్చిలో పూర్తి కావడంతో అప్పటి నుంచి అందుబాటులోకి వచ్చింది. భవనానికి రంగులు వేసి పైకి ఆకర్షణీయంగా మార్చారు. లోపల మాత్రం అంతా డొల్లగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


బీటలు వారిన గోడ


పెచ్చులూడిన పైకప్పు


టైల్స్ కుంగిపోయిన మరుగుదొడ్డి

# కనిపిస్తే కరిచేస్తున్నాయి!

● ఇంద్రవెల్లి పీహెచ్‌సీలో టీటీ ఇంజెక్షన్లు కరవు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే

ఇంద్రవెల్లి మండలంలో కుక్కల బెడద తీవ్రమైంది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారులపై స్వైర విహారం చేస్తూ కనిపించిన వారిని కరిచేస్తున్నాయి. మరోపక్క కుక్క కరిస్తే ఇచ్చే రేబీస్ ఇంజెక్షన్లు పీహెచ్‌సీలో ఉన్నా.. టీటీ ఇంజెక్షన్లు లేక బాధితులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో ప్రైవేటులో కొనుగోలు చేస్తున్నారు. ఇంద్రవెల్లి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలతో పాటు మండల కేంద్రంలో జనవరి నుంచి సెప్టెంబరు 23 వరకు 111 మంది కుక్క కాట్లకు గురయ్యారు. రెండు రోజుల కిందట మండలంలోని వడ్‌గాంకు చెందిన ఆత్రం మారును కుక్క కరిచింది. ఆయన ఇంద్రవెల్లి పీహెచ్‌సీకి వచ్చారు. అక్కడ రేబీస్ ఇంజెక్షన్ చేయాలంటే.. టీటీ ఇంజెక్షన్ లేదని ప్రైవేటు మెడికల్ దుకాణం నుంచి కొనుక్కోవాలని వైద్య సిబ్బంది తెలిపారు. మారు ఓ ప్రైవేట్ మెడికల్ దుకాణానికి వచ్చి టీటీ ఇంజెక్షన్ కొనుగోలు చేసుకొని వెళ్లాడు.

☛ ఈ విషయమై ఇంద్రవెల్లి పీహెచ్‌సీ వైద్యుడు రాథోడ్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. పది రోజులుగా టీటీ ఇంజెక్షన్లు లేవన్నారు. ఈ నెలలో 11 మంది కుక్కకాటుకు గురయ్యారన్నారు.


ఇంద్రవెల్లి మండల కేంద్రంలో గుంపుగా తిరుగుతున్న శునకాలు


టీటీ ఇంజెక్షన్ కొనుగోలు చేసి తీసుకెళ్తున్న యువకుడు ఆత్రం మారు

# పెద్దలు పెళ్లికి ఒప్పుకోరని.. పురుగుమందు తాగిన ప్రేమికులు

● ప్రియుడు మృతి.. ప్రియురాలి పరిస్థితి విషమం

**ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే :** ప్రేమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోరనే మనస్తాపంతో ప్రేమికులు పురుగు మందు తాగిన ఘటన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో ప్రియుడు చనిపోగా.. ప్రియురాలి పరిస్థితి విషమంగా ఉంది. ఉట్నూరు ఎస్సై మనోహర్ వివరాల ప్రకారం.. ఉట్నూరు మండలం కన్నాపూర్ పంచాయతీ రాంజీగూడకు చెందిన ఆత్రం తుకారాం, విజ్జుబాయికి ముగ్గురు సంతానం. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. తుకారాం మూడేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. పెద్ద కొడుకు ఆత్రం హన్మంత్‌రావు(22) వారికున్న నాలుగెకరాల భూమిని సాగు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నార్నూర్ మండలానికి చెందిన ఓ యువతి(17)తో ప్రేమలో పడ్డాడు. పెళ్లి విషయం పెద్దలకు చెబితే వారు ఒప్పుకోరని మనస్తాపం చెందారు. సోమవారం వారిద్దరు రాంజీగూడ పొలిమేరలోని పంట చేనులో పురుగు మందు తాగేశారు. సాయంత్రం వరకు హన్మంత్‌రావు ఇంటికి రాకపోవడంతో తల్లి విజ్జుబాయి, స్థానికులు, బంధువులకు కొడుకు చేను నుంచి ఇంటికి రాలేదని తెలిపింది. వారు వెతకగా.. పొలం వద్ద స్పృహతప్పి పడిపోయి ఉన్నారు. వారిని అంబులెన్స్‌లో ఉట్నూరు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకునే లోపే హన్మంత్‌రావు మృతి చెందాడు. యువతిని మెరుగైన వైద్యం కోసం అదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. బాధితుడి తల్లి విజ్జుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై మనోహర్ పేర్కొన్నారు.


ఆత్రం హన్మంత్‌రావు



## సారు.. మా గోడు వినండి!

తలమడుగు జిల్లా పరిషత్తు సెకండరీ ఉన్నత ఉన్నత పాఠశాలలో 335, ప్రాథమిక పాఠశాలల్లో 111 మొత్తం 446 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గతంలో ఉన్న మరుగుదొడ్లను మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా కూల్చేశారు. ప్రస్తుతం మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాలికల పరిస్థితి దయనీయంగా ఉంది. ఒంటికి, రెంటికి పాఠశాల నుంచి ఇంటికే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు విద్యార్థులు పాఠశాల నుంచి బస్టాండ్ రోడ్డు మీదుగా రైల్వే ట్రాక్‌వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు ఏక్షణం ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రహరీ సైతం లేక మూగజీవాలు ఆవరణలోకి వస్తున్నాయి. కలెక్టర్ సార్ స్పందించి మా సమస్య తీర్చాలని వారంతా వేడుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, తలమడుగు**

## ఎంబీబీఎస్ మొదటి ఏడాదిలో 89 శాతం ఉత్తీర్ణత

**ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే :** ఎంబీబీఎస్ మొదటి ఏడాది పరీక్ష ఫలితాలను కాళోజీ నారాయణరావు విశ్వవిద్యాలయం మంగళవారం విడుదల చేసింది. ఆదిలాబాద్ రిమ్స్ నుంచి గత ఆగస్టులో మొదటి సంవత్సరం పరీక్షలు రాసిన వారిలో 89.25 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 121 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 108 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత సాధించిన వారిలో 49 మంది మొదటి శ్రేణిలో, ఇద్దరు డిస్టింక్షన్‌లో, మరో 57 మంది రెండో శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

## ఇచ్చోడ ఎస్ఐ ఎస్పీ కార్యాలయానికి అటాచ్డ్

**ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే :** ఇచ్చోడ ఎస్ఐ జి.నరేష్‌ను ఎస్పీ కార్యాలయానికి అటాచ్డ్ చేశారు. ఎస్పీ గౌష్ ఆలం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించాడన్న ఆరోపణలపై ఆయనపై చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఆయనపై ఇది వరకు పలు ఫిర్యాదులు ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయమై ఉట్నూరు డీఎస్పీ సీహెచ్ నాగేందర్‌ను వివరణ కోరగా.. విధి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగానే క్రమశిక్షణ చర్యల్లో భాగంగా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

# సహకార సంఘాలకు నోటీసుల దడ

● పెనుభారంగా ఆదాయపు పన్ను.. జీఎస్టీ







న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల లావాదేవీలు, క్రయవిక్రయాలు తదితర వాటిపై ఆదాయ పన్ను శాఖ నుంచి నోటీసులు రావడంతో సంఘాలు కంగుతిన్నాయి. ఇప్పుడిప్పుడే ఎరువులు, విత్తనాల విక్రయాలతోపాటు, రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ, ఆదాయాన్ని సమకూర్చుకుంటూ.. నిలదొక్కుకుంటున్న సంఘాలకు ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు రావడంతో సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. క్రయవిక్రయాలపై వచ్చే ఆదాయంపై పన్ను చెల్లించాలని ఐటీ, సంఘాలు నిర్వహించే సేవా రంగాలు, వ్యాపార లావాదేవీలకు జీఎస్టీ నోటీసులు రావడంతో సంఘాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో వివిధ సహకార సంఘాలకు రూ. 5లక్షలనుంచి రూ. కోటి వరకు చెల్లించాలని ఈ నోటీసుల్లో పేర్కొనడంతో సంఘాలు విస్తుపోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలోని 77 సహకార సంఘాలు రైతుల కోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. గతంలో సంఘాలు కేవలం పంట రుణాల తదితర వాటికి పరిమితం కావడం, బినామీ పేరుతో చాలా మంది రుణాలు తీసుకోవడంతో సంఘాలు నష్టాల్లో కూరుకుపోయాయి. ఇప్పటికీ 20కి పైగా సంఘాలు నామమాత్రంగానే ఉన్నాయి. కొన్ని సంఘాలు ఎరువులు, విత్తనాలు విక్రయించడం, రైతుల నుంచి కమీషన్‌తో పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం, పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్లు నిర్వహించి, ఆదాయాన్ని పెంచుకొని నిలదొక్కుకుంటున్నాయి. కొన్ని సంఘాలు రైతుల నుంచి డిపాజిట్లు సేకరిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు చేసే డిపాజిట్లు, తీసుకునే వడ్డీ పైనా పన్ను చెల్లించాలని ఆదాయ పన్ను శాఖ నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసులపై స్పందించిన సహకార సంఘాలు కమిషనర్‌ను కలిసి రైతుల సేవలకు సంబంధించిన లావాదేవీలపై ఆదాయ పన్ను మినహాయించాలని వినతిపత్రం ఇచ్చినట్లు సహకార సంఘం అధ్యక్షుడు పండరి తెలిపారు.

### జీఎస్టీ పరిధిలోకి..

వాణిజ్య పన్నుల శాఖ గతంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండేది. అప్పుడు సంఘాలు నిర్వహించే వాటిపై పన్ను ఉండేది కాదు. 2017 జులై 1 నుంచి వాణిజ్య పన్నుల శాఖ పరిధిలోని పన్నుల వసూళ్లు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని జీఎస్టీ కిందకు వెళ్లాయి. ఎరువుల విక్రయాలపై 5 శాతం, పురుగు మందుల విక్రయాలపై 18 శాతం పన్నును సంఘాలు జీఎస్టీ రూపంలో చెల్లించాల్సి వస్తోంది. గతంలో మాదిరిగానే సంఘాలు ఆదాయ వ్యయాలకు సంబంధించి లెక్కలు చూపించడం లేదు. 2017 నుంచి 2021 వరకు సంవత్సరం వారీగా ఆదాయ వ్యయ వివరాలను తెలియజేయాలంటూ నోటీసులు రావడంతో సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జీఎస్టీ నోటీసుల నేపథ్యంలో సహకార సంఘాలు చార్టెడ్ అకౌంటెంట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకొని సంవత్సరం వారీగా ఆదాయ, వ్యయ లెక్కలు అప్పజెప్పే పనిలో ఉన్నాయి.

**జిల్లాల వారీగా సహకార సంఘాలు**

| జిల్లా | ఆదిలాబాద్ | నిర్మల్ | మంచిర్యాల | కుమురంభీం |
|---|---|---|---|---|
| సంఘాలు | 28 | 17 | 20 | 12 |
| సభ్యులు | 59,493 | 46,928 | 47,474 | 23,788 |

## డీఎస్సీ-2008 అభ్యర్థులకు ఊరట

● ఉమ్మడి జిల్లాలో 135 మందికి లబ్ధి

**పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే :** డీఎస్సీ -2008లో తొలుత ఉపాధ్యాయులుగా ఎంపికై డీఎడ్ వివాదంతో ఆ తర్వాత కోర్టు ఉత్తర్వులతో అవకాశం కోల్పోయిన బీఎడ్ అభ్యర్థులకు ఊరట లభించింది. వారి అభ్యర్థన మేరకు కోర్టు ప్రభుత్వానికి ఉపాధి చూపించాలని సూచించింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కాంట్రాక్టు పద్ధతిన ఉపాధ్యాయులుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 135 మంది అప్పట్లో డీఎస్సీకి ఎంపిక కాగా.. వారందరికీ లబ్ధి చేకూరనుంది. ఇదిలా ఉంటే ఇందులో కొందరు ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరినట్లు విద్యాశాఖ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నెల 27 నుంచి ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని సూచించడంతో అప్పుడే ఎంత మంది ముందుకు వస్తారనేది తేలనుంది.





## కొంగ తెల్లన.. తల నల్లన



పంట పొలాల్లో గడ్డి కోసం పశువులు, గింజల కోసం పక్షులు రావడం సహజం. కానీ ఇక్కడ గింజలు లేవు పచ్చని పచ్చిక మాత్రమే ఉంది. మరి పచ్చికలో ఈ పక్షులకు పనేంటి అనుకుంటున్నారా.. సారంగాపూర్ మండలం చించోలి గ్రామ శివారులోని పంట పొలంలో కనిపించిన తెల్లని శరీరం, నల్లని తల కలిగిన ఈ పక్షులను ఇబిస్ కొంగలు అంటారు. వీటి శాస్త్రీయ నామం థ్రిస్ కిరోనిస్ మెలనో సెఫాలస్. దేశమంతటా తిరుగుతూ పచ్చని, తడి నేల ప్రాంతాల్లో క్రిమి కీటకాలు, మట్టిలోని చిన్న చిన్న పురుగులను ఆహారంగా తీసుకుంటాయని ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్రం అసోసియేట్ ప్రొఫెసర్ వెల్మల మధు తెలిపారు.

- చిత్రం: న్యూస్‌టుడే, నిర్మల్

## 'యూబిట్ కాయిన్' వ్యవహారంలో పోలీసుల అదుపులో ఉపాధ్యాయుడు

**సోనాల(బోథ్), న్యూస్‌టుడే :** బోథ్ మండలం సోనాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిని యూబిట్ కాయిన్ వ్యవహారంలో నిర్మల్ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే నిర్మల్ జిల్లా పోలీసులు సోనాలలోని రామాలయం కాలనీలో రెక్కీ నిర్వహించారు. ఉదయం 6 గంటల ప్రాంతంలో ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. సదరు ఉపాధ్యాయుడు యూబిట్ కాయిన్ వ్యవహారంలో సభ్యులను ఈ వ్యాపారంలో చేర్చుతూ స్టార్ రేటింగ్ పొందినట్లు సమాచారం. సోనాల, బోథ్ చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు నిర్మల్ జిల్లాలోని పలు మండలాల్లోని తన బంధువులను ఈ వ్యవహారంలోకి లాగి రూ.లక్షల్లో నగదును పెట్టుబడిగా పెట్టించినట్లు సమాచారం. పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే విషయం తెలియడంతో ఈ వ్యాపారంలో పెట్టుబడి పెట్టిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు.



విద్యార్థులకు ఉచిత శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

## విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించాలి

**ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే :** విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని బంగారుగూడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇన్సినరేటర్ యంత్రం, శానిటరీ ప్యాడ్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. లెర్నింగ్ కర్వ్, భారత్ పెట్రోలియం కెమికల్స్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా జిల్లాలోని 18 కస్తూర్బాలకు ఉచితంగా ఇన్సినరేటర్ యంత్రాలు(శానిటరీ ప్యాడ్లను కాల్చివేసే యంత్రం), ఏడాదికి సరిపడా శానిటరీ ప్యాడ్లను విద్యార్థులకు అందించారు. వాటిని జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇన్సినరేటర్ ఉపయోగాలను విద్యార్థులకు వివరించి పర్యావరణ పరిరక్షణలో దాని పాత్రను తెలిపారు. విద్యార్థులు కౌమార దశలో ఎలాంటి ఇబ్బందులకు గురికావద్దన్నారు. అనంతరం విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. డీఈవో ప్రణీత, కేజీబీవీల సంయుక్త అధికారి ఉదయశ్రీ, లెర్నింగ్, బీపీసీఎల్ సంస్థ ప్రతినిధులు స్వప్న, మోనిష్‌రెడ్డి, నాగరాజు, ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆ గడియారం ఆగదు

**కబీర్‌దాస్ మాటలు గుర్తు చేసుకుంటే..**

'రేపు చేయాల్సిన పని ఈ రోజే చేయి. ఈ రోజు చేయాల్సిన పనిని ఇప్పుడే చేసెయ్..' అని సంత్ కబీర్‌దాస్ చెప్పిన మాట ఇప్పటికీ గుర్తు చేసుకుంటామంటే 'కాలం' ఎంత విలువైందో కదా..



జీవితంలో ఏదైనా సాధించాలంటే సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెబుతారు. సక్సెస్ సాధించిన వారి గురించి వివరిస్తూ ఎవరికైనా 24 గంటల సమయమే ఉంటుంది.. దాన్ని ప్రణాళిక ప్రకారం ఉపయోగించుకుంటే విజయం సాధిస్తారని యువతను, విద్యార్థులను ఉద్దేశించి చెబుతారు.

**అందరికీ అంతే కదా..**

**విజయం వెనక సమయం:**



రోగిని పరీక్షిస్తున్న డా.రమాదేవి

మాది నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం బీరవెల్లి. వ్యవసాయ నేపథ్యమున్న అమ్మానాన్నలు కష్టపడి నన్ను చదివించారు. ఒక సాధారణ కుటుంబం నుంచి నేను ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇప్పుడు ఉస్మానియాలో పీజీ(గైనకాలజీ) చేస్తున్నానంటే దాని వెనక ఎంతో ప్రణాళిక ఉంది. ఎక్కడా సమయం వృథాచేయలేదు. వృత్తిలోనూ నాడి పట్టడం, తక్షణ చికిత్స అందించాల్సిన పరిస్థితిల్లో సమయమే ప్రధానం. -డా.రమాదేవి

**12**

● ఎవరికైనా సమయం 24 గంటలే

**✸ నెపోలియన్**

గాఢంగా నిద్రపోతున్నప్పుడు సైన్యాధిపతి వచ్చి 'శత్రుసైన్యం దక్షిణ దిక్కునుంచి చొచ్చుకొస్తోందని' చెబుతాడు. చటుక్కున నిద్రలేచి 'అవునా అయితే ఆ గోడ మీద రాసిన 64వ నంబరు పద్ధతిలో శత్రువుల్ని ఎదుర్కోండి' అని అప్రమత్తం చేస్తాడు. ఏ సమయంలో ఎలా వ్యవహరించాలో ముందుగానే ప్రణాళిక చేసుకుంటే కాలం కలిసొస్తుందనేందుకు ఇది సరిపోదా..

**అదును దాటితే చీడతో పీడనే..**

ఏ సమయంలో చేయాల్సిన పనిని ఆ సమయంలోనే చేయాలంటారు. ఇది రైతన్న విషయంలోనూ చాలా కీలకమే. విత్తనాలు వేయడం మొదలు కొని కలుపు తీయడం, ఎరువులు, మందులు చల్లడం వంటివి సమయానుకూలంగా చేయకపోతే చీడపీడలు నష్టం కలిగిస్తాయి.



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

**నిమిషం నిబంధన తెలుసుగా..**

ఆ టైమ్‌ది ఏముందిలే ఓ గంట అటూఇటూ అని తేలిగ్గా కొట్టిపారేస్తే కుదరదండోయ్. గంట కాదు నిమిషం కూడా ఎంత కీలకమో 60 సెకన్లు ఆలస్యంగా వెళ్లి వెనుదిరిగి పోటీ పరీక్ష రాయలేకపోయిన అభ్యర్థులను అడిగి చూడండి సమయం విలువ ఏంటో చెబుతారు.

**9**

**కానీ గడియారం ముల్లు గుచ్చుకుంటోంది..**






నిర్మల్‌కు చెందిన మడిపల్లి దక్షిణామూర్తి రేడియో వ్యాఖ్యతగా వ్యవహరిస్తారు. వివిధ సందర్భాల్లో పలు అంశాలపై ఆయన మాట్లాడుతున్నప్పుడు 'ఈ విషయంపై మరింత లోతుగా.. వివరంగా చెప్పాలని ఉంది కానీ మా స్టూడియోలోని గడియారం ముల్లు నన్ను గుచ్చుకుంటోంది..' అంటూ నవ్వుతూనే తనకిచ్చిన సమయం పూర్తవుతోందని చెబుతుంటారు.

-మడిపల్లి దక్షిణామూర్తి

**ఈ అలారమే నిద్రలేపేది..**

'ఈ అలారం గడియారాన్ని నేను 1990లో కొనుగోలు చేశాను. విద్యార్థి దశలో నన్ను ఉదయాల్లో నిద్రలేపింది. ఉద్యోగంలో చేరాక ప్రయాణాలు చేయాల్సి వస్తే అది మోగించిన శబ్దమే దూరంగా ఉన్న గమ్యాన్ని సకాలంలో చేరేలా చేసింది. అందుకే ఇప్పటికీ ఇంట్లో భద్రంగా ఉంచాను..' దిల్లీలోని కెనడా రాయబార కార్యాలయంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఖానాపూర్‌కు చెందిన టి.సంపత్‌కుమార్ అలారంతో ఉన్న అనుబంధాన్ని వివరించారు.



జీవితంలో ప్రతీది సమయంతో సంబంధమున్నదే. రోజూ అన్నీ దాదాపు గడియారంకేసి చూస్తూ చేసే పనులే. ఏయ్ తెల్లారింది బడికి టైం అవుతుందని అమ్మ పిల్లల్ని నిద్రలేపడం. ఏమోయ్ నేను ఆఫీసుకి గంట ముందే వెళ్లాలి త్వరగా టిఫిన్ చేసేయ్ అని భర్త చెప్పడం.. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి పంపించరని విద్యార్థులు ముందుగానే అప్రమత్తమయ్యేవన్నీ చూస్తూనే ఉంటాం. అంతెందుకు ఏ సమయంలో పుట్టాడు.. ఎప్పుడు మరణించాడు అనే ప్రశ్నలకూ 'టైమే' కదా సమాధానం.

-న్యూస్‌టుడే, మామడ

**3**



'తమ్ముడూ టైం అవుతోంది పదా'.. బడికెళ్లే ముందు సమయం చూసుకుంటున్న నిర్మల్‌కు చెందిన చిన్నారులు మనోమయి, మోక్షిత్



నిర్మల్‌లో ఉన్న అమ్మానాన్నలు గంగాసాగర్ రెడ్డి-అరుణ కుమారుడితో మాట్లాడుతున్నప్పుడు రాత్రి 8.20 (వెనక గోడ గడియారంలో)

**ఫోన్ చేయాలన్నా టైం చూసుకోవాల్సిందే..**

సాధారణంగా మనకు ఉదయం పూట ఎవరైనా ఫోన్ చేస్తే గుడ్ మార్నింగ్ అంటుంటాం. కానీ పొద్దున్నే కాల్ వచ్చిన అన్ని సార్లు శుభోదయం చెప్పడం కుదరదు. విద్య, ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి చాలా మంది విదేశాల్లో ఉంటున్నారు. వాళ్ల స్వదేశంలో ఉండే తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడాలంటే తప్పకుండా 'టైం' చూసుకుంటారు. రెండు దేశాల టైంజోన్ వేర్వేరుగా ఉంటుంది. మన సమయానుకూలంగా అక్కడ ఉన్న వాళ్లకు ఫోన్ చేస్తే వాళ్లు రాత్రి గాఢ నిద్రలో ఉంటారు.

**6**





న్యూయార్క్‌లో ఉన్న ప్రశాంత్‌రెడ్డి ఫోన్‌లో తల్లిదండ్రులతో మాట్లాడుతుండగా సమయం ఉదయం 10.49 (కంప్యూటర్ తెరపై)

**అలిసిపోని గడియారం..**

గడియారం రోజంతా పనిచేస్తూనే ఉంటుంది. కాసేపటికే అలసి పోయామనుకునే వారు వాచీ చూసి ఉత్తేజం తెచ్చుకోవచ్చు..



| గంటల ముల్లు రోజులో రెండు సార్లు చుట్టూ తిరుగుతుంది.. | నిమిషాల ముల్లు 24 సార్లు | సెకండ్ల ముల్లు 1440 సార్లు |
|---|---|---|

## సత్వర సేవల్లో బెల్లంపల్లి పోలీస్‌స్టేషన్ భేష్

● రాష్ట్రంలో మూడో స్థానం

**బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:** ప్రజలకు సత్వర సేవలు అందించినందుకు రాష్ట్రవ్యాప్తంగా పది పోలీస్ స్టేషన్లను ఎంపిక చేశారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బెల్లంపల్లి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఎస్‌హెచ్‌ఓ దేవయ్యతోపాటు ఇతర సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించారు. వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించడం, పోలీసుల పట్ల నమ్మకం కలిగేలా చేయడం, ప్రజలకు సత్వర సేవలు అందించడాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సత్వర సేవల్లో మూడో స్థానం కేటాయించారు. ఈ పోలీస్‌స్టేషన్ సిబ్బందిని సీపీ శ్రీనివాస్, ఐజీ ప్రత్యేకంగా అభినందించారు.





బెల్లంపల్లిలోని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్

## త్వరలో సీఎంతో గిరిజన, ముస్లిం నేతల సమావేశం

● మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న సీతక్క, చిత్రంలో షబ్బీర్ అలీ, వెడ్మ బొజ్జు, తదితరులు

**ఈనాడు, హైదరాబాద్ :** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో గిరిజనులు, ముస్లింల మధ్య శాంతియుత సంబంధాలను పునరుద్ధరించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కోరారు. జైనూర్‌కు చెందిన ముస్లిం, గిరిజన నేతలతో మంగళవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మంత్రి సీతక్కతో కలిసి మాట్లాడారు. ఈ నెల 4న చెలరేగిన మతపరమైన అల్లర్ల సమస్యను పరిష్కరించడంపై చర్చించారు. రెండు వర్గాల మధ్య సామరస్యం చెక్కుచెదరకుండా చూసుకోవాలన్నారు. ఈ నెల 28 లేదా 29న సీఎం రేవంత్‌రెడ్డితో గిరిజన, ముస్లిం నేతలతో ఉమ్మడి సమావేశం ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. ఇరువర్గాలు తమ విభేదాలను పరిష్కరించుకుని, శాంతియుత సంబంధాలను పునరుద్ధరించుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొన్న ఇరువర్గాల నాయకులు తమ మధ్య ఎటువంటి విభేదాలు లేవన్నారు. ఒకరి సంప్రదాయాలు, గుర్తింపును మరొకరు గౌరవించుకోవడానికి అంగీకరించారు. ఇటీవల ఉట్నూర్, జైనూర్‌లోని గోండు ఆదివాసీ నాయకులతో సమావేశమైన మంత్రి అక్కడి అంశాలను ఈ సమావేశంలో వివరించారు. మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు గిరిజన నేతలతో ఇటీవల సమావేశమైన అనంతరం వివాదానికి గల కారణాలు, శాంతిభద్రతల పునరుద్ధరణకు చేపట్టిన చర్యలను వివరిస్తూ ముఖ్యమంత్రికి తాజాగా నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, విద్యావేత్త మహబూబ్ ఆలంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## 63వ జాతీయ రహదారి విస్తరణకు నిధులు మంజూరు



దిల్లీలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

**చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే:** కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్‌గడ్కరీని మంగళవారం దిల్లీలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణలు కలిశారు. చెన్నూరు నియోజకవర్గానికి సంబంధించి పలు రహదారులపై మంత్రితో చర్చించారు. 63వ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చెన్నూరు-భీమారం మండలాల సరిహద్దున జోడువాగు వద్ద రోడ్డు విస్తరణకు రూ.100 కోట్లను మంత్రి మంజూరు చేసినట్లు వారు పేర్కొన్నారు. కోటపల్లి మండలంలోని నక్కలపల్లి వాగుపైన వంతెన నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. జోడువాగుల వద్ద రోడ్డు మరమ్మతులకు ఇదివరకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.1.80 కోట్లు మంజూరుచేసినట్లు వారు చెప్పారు.



విద్యార్థులతో ఏకలవ్య మోడల్ గురుకులం ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే :** ఇంద్రవెల్లి ఏకలవ్య మోడల్ గురుకుల విద్యార్థులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సౌరభ్ యాదవ్ తెలిపారు. మంగళవారం పిట్టబొంగరం పంచాయతీ పాటగూడలోని ఏకలవ్య మోడల్ గురుకులంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. లక్షెట్టిపేటలోని మహాత్మా జ్యోతిబాపులే పాఠశాలలో సోమవారం జరిగిన అండర్-19 కుస్తీ పోటీల్లో పదోతరగతి విద్యార్థి పవన్, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి రాథోడ్ సాయికిరణ్ ప్రతిభ కనబరిచారు. వైస్ ప్రిన్సిపల్ రేఖారాణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 29న చదరంగం..

**ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే :** ఆదిలాబాద్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29న అండర్-15 ఏళ్ల విభాగం బాలబాలికల ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి నన్నపు స్వామి, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీం, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఆసక్తి ఉన్న క్రీడాకారులు చరవాణి 98487 36476, 62819 66588 నెంబర్లను సంప్రదించి తమ పేర్లను ఈ నెల 28లోపు నమోదు చేసుకోవాలని సూచించారు.



విద్యార్థినులకు పురస్కారం అందజేస్తున్న ప్రిన్సిపల్ హరిత

## కేయూ క్రీడాపోటీలలో విద్యార్థినుల ప్రతిభ

**ఉట్నూరు:** కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన గురుకుల విద్యార్థినుల క్రీడా పోటీలలో ఉట్నూరు గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ హరిత తెలిపారు. చెస్‌లో విద్యార్థినులు మల్లేశ్వరి, ధ్రుపత, రాశికళ, జ్యోతిలు మొదటి స్థానాన్ని సాధించి సత్తాచాటారు. పరుగు పందెంలో లక్ష్మి, భీంబాయి, లావణ్య, ప్రియాంక, అనిత రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. పీడీ మంగ, అధ్యాపకులు, సిబ్బంది వారిని అభినందించారు.

# విధుల నిర్లక్ష్యం.. వికటిస్తున్న లక్ష్యం

● పోలీసుల్లో పెరుగుతున్న ఆశ్రిత పక్షపాతం



**ఈటీవీ - ఆదిలాబాద్ :** పోలీసంటే? న్యాయం, ధర్మం, బాధితుల పక్షం వహించే పవిత్రమైన విధి నిర్వహించేవారు. కానీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొంతమంది అధికారుల ఆశ్రిత పక్షపాత వైఖరి ఆ శాఖకే మచ్చ తెచ్చేలా మారుతోంది. రాజకీయ అండదండలు కలిగిన కొందరు పోలీసుల వ్యవహారం ఉన్నతాధికారులకే సవాలు విసిరేలా మారుతోంది. ఇటీవల ఓ అధికారి తన అధికార దర్పంతో బినామీలను ముందుంచి రూ.కోట్లు విలువ చేసే స్థిరాస్తి దందా, అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు, పెట్రోల్ బంక్‌ల నిర్వహణలో తలదూర్చిన వివాదం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లిన విషయం విదితమే. ఆయనతోపాటు తాజాగా మరో అధికారి పాత్రపై ఉన్నతాధికారులు అంతర్గతంగా ఆరా తీశారు. సంబంధంలేని విషయాల్లో కొందరు తలదూర్చటంతో అపవాదును మూటగట్టుకోవాల్సి వస్తోంది.

**ఆదిలాబాద్ అక్రమాలు**

ఆదిలాబాద్ జిల్లా బోథ్ సర్కిల్ పరిధిలో విధుల నిర్వహణ పట్టుతప్పుతోంది. నిబంధనలకు విరుద్ధంగా జరిగే స్థిరాస్తి వ్యాపారులకు, అంతరాష్ట్ర పరిధిలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు మీదుగా సాగే రాకపోకలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. జూద స్థావరాల నిర్వహణ, అక్రమంగా జరిగే గుట్కా విక్రయాల్లో కొందరి పాత్ర ఉన్నట్లు అధికారుల దృష్టికి వెళ్లింది. అలాంటి ఫిర్యాదుల పైనే తాజాగా ఇచ్చోడ ఎస్ఐని ఆదిలాబాద్ ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు వెలువరించారు.

**నిర్మల్ - తేదీ తారుమారు**

నిర్మల్ డివిజన్‌లో కొందరి విధి నిర్వహణ ఇష్టారాజ్యంగా సాగుతున్నట్లు బయటపడింది. నిర్మల్ గ్రామీణ మండలంలో మూడు నెలల కిందట కారు - ద్విచక్ర వాహన ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు కారుకు బీమా లేదు. అప్పుడు కేసు నమోదు చేయలేదు. కారుకు బీమా చేశాక తేదీలు తారుమారు చేసి ప్రమాదం జరిగినట్లు చూపారు. సారంగాపూర్‌లో అనవసర విషయాల్లో తలదూర్చారనే మరో ఆరోపణ తోడవటంతో ఓ ఎస్ఐపై సస్పెన్షన్ వేటుపడింది.

**మంచిర్యాల - రాజకీయం**

మంచిర్యాల జిల్లాలో నాలుగు నెలల కిందటి ఘటన పోలీసుల మధ్య సమన్వయలోపాన్ని బహిర్గతం చేసింది. విధుల్లో సరిగా స్పందించలేదనే కారణంపై ఓ ఎస్ఐని బాధ్యతల నుంచి తప్పించడంతోనే సరిపెట్టారే కానీ దాని వెనుక అసలైన వారెవరనేది గుర్తించలేదు. మంచిర్యాలలో ఓపార్టీ ద్వితీయ శ్రేణి నాయకుడిపై ఏడెనిమిది మంది యువకులు దాడి చేసి గాయపర్చటం వెనుక మరో పార్టీ నాయకుల హస్తం ఉందని ప్రచారం జరిగింది. కేసులోని ప్రాధాన్యతను గుర్తించకుండా పోలీసులు మామూలుగా వదిలేశారనే ఆరోపణపై ఓ ఎస్ఐను విధుల నుంచి తప్పించి రామగుండం కమిషనరేట్‌కు అటాచ్ చేశారు.

**ఆదివాసీ కోటలో**

ఆదివాసీకోట ఆసిఫాబాద్‌లో కొంత మంది అధికారుల పాత్ర విమర్శలకు తావిచ్చేలా మారుతోంది. బాధితుల పక్షాన కాకుండా భయభ్రాంతులకు గురిచేసే వారినే వెనకేసుకొస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. ఇటీవల కాగజ్‌నగర్ డివిజన్‌లో ఓ సీఐని విధుల నుంచి తప్పించగా, తాజాగా ఆసిఫాబాద్‌లో డీఎస్పీని తప్పించిన విషయం విదితమే. సమస్యలు ఉత్పన్నమైనప్పుడే అప్రమత్తం కావటం తప్పితే అసలు కారణాలు ఆరా తీయడం లేదనే విమర్శలకు తావిస్తోంది.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 90309 25238
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 96031 04720
ఉట్నూరు: 94410 86640

**న్యూస్‌టుడే, ఇచ్చోడ:**

? బజార్‌హత్నూర్‌లో మూడు రోజులుగా భగీరథ నీరు రావడం లేదు. తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. **- స్థానికుడు, బజార్‌హత్నూర్**

✔ ప్రతి గ్రామానికి బుధవారం నీటి సరాఫరా జరుగుతుంది. ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- శ్రీకాంత్‌రెడ్డి, గ్రిడ్ ఏఈ**

**న్యూస్‌టుడే, బోథ్:**

? బోథ్ సాయినగర్ బస్టాప్ వద్ద రహదారి పక్కనే దుకాణాలు ఉన్నాయి. వీధులలో నుంచి రహదారిపైకి వచ్చే ద్విచక్ర వాహనాలు కనిపించక ప్రధాన రహదారిపై నుంచి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. **- రమేష్, ప్రైవేటు ఉపాధ్యాయుడు, కన్గుట్ట**

✔ ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడతాం. **- అంజయ్య, ఈవో, బోథ్**

**న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్ :**

? ఆదిలాబాద్ పట్టణంలోని ద్వారకానగర్‌లో యోగా భవనం చివరిదశ పనులు పూర్తికాక వృథాగా ఉంది. పనులు పూర్తి చేస్తే కాలనీవాసులకు ఉపయోగకరంగా ఉంటుంది. **- రాజశేఖర్, స్థానికుడు**

✔ పనులు పూర్తి చేసి త్వరలో యోగా భవనాన్ని వినియోగంలోకి తెస్తాం. **- తిరుపతి, డీఈఈ**

## భారాస నాయకుడి మృతి

**ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే :** పట్టణంలోని మహాలక్ష్మీవాడకు చెందిన భారాస నాయకుడు గోలి శంకర్(40) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు ఛాతిలో నొప్పిరావడంతో సన్నిహితులు సాయంత్రం రిమ్స్‌కు తరలించారు. కొద్దిసేపటికే మృతి చెందారు. పురపాలక అధ్యక్షుడు జోగుప్రేమేందర్, భారాస నాయకులు కుటుంబాన్ని పరామర్శించారు.

## అనారోగ్యంతో ఆశా కార్యకర్త..

**సొనాల(బోథ్), న్యూస్‌టుడే :** అనారోగ్యంతో ఆశా కార్యకర్త మృతి చెందారు. బోథ్ మండలం గొల్లాపూర్‌కు చెందిన ఆశా కార్యకర్త మెస్రం తుల సీబాయి(55) ఆదివారం రాత్రి వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సోమవారం ఉదయం కుటుంబసభ్యులు బోథ్ సీహెచ్‌సీకి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. ఆమెకు భర్త భీంరావు ఉన్నారు. కుటుంబ సభ్యులను మంగళవారం వైద్యుడు నవీన్‌రెడ్డి, సొనాల పీహెచ్‌సీ సిబ్బంది పరామర్శించారు.

## కలప పట్టివేత

**సిరికొండ, న్యూస్‌టుడే :** సిరికొండ మండలం ఫకీర్‌నాయక్‌తండాలో మంగళవారం టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో 9 దుంగలు పట్టుకున్నట్లు సమాచారం. పట్టుకున్న కలపను ఇచ్చోడ టింబర్ డిపోకు తరలించారు. తనిఖీలు నిర్వహిస్తున్న అటవీ సిబ్బందితో గ్రామస్థులు వాగ్వాదానికి దిగారు. దాడి చేసే పరిస్థితి నెలకొనడంతో అటవీ అధికారులు, సిబ్బంది తిరుగుముఖం పట్టారు.

## ఆందోళన చేసిన పలువురిపై కేసులు

**ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే:** నార్నూర్ మండలం చోర్‌గాంకు చెందిన విద్యార్థి రాథోడ్ జితేందర్‌ను నలుగురు వ్యక్తులు పురుగు మందు తాగించి హత్య చేశారని ఆరోపిస్తూ శనివారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలో ఆందోళనలు చేపట్టిన పలువురిపై ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీసులు మంగళవారం కేసులు నమోదు చేశారు. ఎస్సై విష్ణుప్రకాష్ వివరాల మేరకు శనివారం రాత్రి పోలీసులు అడ్డుకుంటున్నా వినిపించుకోకుండా కృష్ణా ఆసుపత్రి, జాతీయ రహదారిపై ఆందోళనలు చేపట్టి ప్రజా జీవనానికి ఆటంకం కలిగించినట్లు పేర్కొన్నారు. ఆందోళనలో పాల్గొన్న రాథోడ్ ఆత్మారాం, రాథోడ్ రాహుల్, పవార్ బలసింగ్, పవార్ నగేష్, అక్షయ్, శ్రీకాంత్ నరేష్, చౌహాన్ మధుకర్, విశ్వనాథ్, పవార్ ఓంపాల్, రాథోడ్ అజయ్, పవార్ కృష్ణ, బాబీసన్, రాథోడ్ దినేష్‌తో పాటు మరి కొందరిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## వ్యభిచార గృహ నిర్వాహకుల రిమాండ్

**ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే:** మావల పోలీసు స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో వ్యభిచార గృహంపై దాడులు చేసి పలువురిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. సోమవారం ఒక నిర్వాహకురాలిని, విటులను సరఫరా చేసే మల్లేష్, మరో ముగ్గురు విటులను కోర్టులో హాజరుపర్చినట్లు ఆయన తెలిపారు.

## నిబంధనలు విస్మరిస్తే చర్యలు

**ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే:** ప్రైవేటు ఆసుపత్రులు, పారామెడికల్ కళాశాలలు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం మేరకు నిర్వహించుకోకుంటే చర్యలు తీసుకుంటామని బాసర జోన్ ప్రత్యేక అధికారి జానకిబాయి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రులతో పాటు పీఎంఆర్ పారామెడికల్ కళాశాలను తనిఖీ చేశారు. రిజిస్టర్‌లో ఉన్న పేర్లు, అక్కడ ఉన్న విద్యార్థుల సంఖ్యను తేడా ఉండటాన్ని గుర్తించారు. కళాశాలలో వసతులు, తరగతులను పరిశీలించారు. తనిఖీల్లో డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఈఓ వెంకటేశ్వరరెడ్డి, పీఓ డీటీటీ రాథోడ్ నరేందర్, అదనపు డీఎంహెచ్‌ఓ గజానన్ తదితరులు పాల్గొన్నారు.

## జైనూర్ ఘటనపై దర్యాప్తు చేయించాలి

**జైనథ్, న్యూస్‌టుడే :** జైనూర్ ఘటనపై దర్యాప్తు చేయించాలని కోరుతూ జనజాతి సురక్షా మంచ్ నాయకులు జాతీయ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ అంతర్‌సింగ్ ఆర్య, సభ్యుడు ఉస్సేన్ నాయక్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జనజాతి సురక్షా మంచ్ ప్రాంత సంయోజక్ కాసెట్టి లక్ష్మణ్, జిల్లా సంయోజక్ నైతం శంకర్, తొడసం అజయ్‌లు దిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిశారు.

# ముఖ్యమంత్రి చెప్పేదొకటి.. చేసేది మరొకటి

**తలమడుగు, న్యూస్‌టుడే :** సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో చెప్పింది ఒకటి.. గెలిచిన తర్వాత చేసేది మరొకటని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఎద్దేవా చేశారు. డిసెంబరు 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని తర్వాత ఆగస్టు 15 వరకు పూర్తిస్థాయి రుణమాఫీ అని రైతులను మోసం చేశారని విమర్శించారు. మంగళవారం తలమడుగు మండలం సుంకిడిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ తిరుమల్‌గౌడ్, నేతలు వెంకటేష్, కిరణ్, కేదారేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అబ్దుల్లా, అభిరామ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, గంగాధర్, రవీందర్, రవికాంత్‌యాదవ్, ప్రకాశ్, మహేష్, గజానన్, దేవ్‌రావు, వామన్, ఆశన్న యాదవ్, అజయ్, సంటి, నర్సింలు, రఘు, వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

★ తలమడుగు మండలం ఖోడద్‌కు చెందిన రాకేశ్‌రెడ్డిని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పరామర్శించారు. ఆయన భార్య రుతుజరెడ్డి రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలుసుకొని ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామ పెద్దలు వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నర్సింగ్ పాల్గొన్నారు.

### 73 మంది విద్యార్థులకు ఒకరే ఉపాధ్యాయుడు

**తాంసి:** పొన్నారి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సందర్శించారు. 73 మంది విద్యార్థులకు పాఠాలు చెప్పేది ఒక్కరేనని తల్లిదండ్రులు, గ్రామస్థులు వివరించారు. కష్టపడ్డ యువకులంతా కలిసి గ్రామంలో ఏర్పాటు చేసుకున్న గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. పోటీ పరీక్షల పుస్తకాల కొనుగోలుకు తన వంతుగా రూ.25 వేలు ఇస్తానని ప్రకటించారు. నాయకులు శ్రీనివాస్, మహేందర్, వినోద్‌రెడ్డి, సదానందం, నారాయణ, సంతోష్, అశోక్, రఘు, రమణ, అశోక్, ఉత్తం, గోవర్ధన్‌రెడ్డి, కృష్ణ ఉన్నారు.


ఆందోళన చేస్తున్న గిర్నూర్ రైతులు

## రైతుల రాస్తారోకో

**బజార్‌హత్నూర్, న్యూస్‌టుడే :** బజార్‌హత్నూర్ చెరువు నుంచి ఎడమ కాలువ ద్వారా పంటలకు తక్షణమే నీటిని విడుదల చేయాలని కోరుతూ మంగళవారం గిర్నూర్ రైతులు సొనాల, ఇచ్చోడ ఆర్‌అండ్‌బీ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. నీటిని విడుదల చేయాలని పలుమార్లు నీటి పారుదల శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల నిరసనతో నీటి పారుదల శాఖ అధికారులు కాలువకు నీటిని విడుదల చేశారు. రైతుల పంటలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటామని పేర్కొన్నారు.

## 27 నుంచి మెగా వాలీబాల్ పోటీలు

**ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే :** పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 29 వరకు గుడిహత్నూర్ మండలంలోని మోడల్ పాఠశాలలో మెగా వాలీబాల్ క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. ఇందులో ప్రవేశాలు ఉచితమేనన్నారు. పోలీసులు-యువత సంబంధాలు మెరుగుపర్చటానికి ఈ క్రీడలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల జట్లు ఇచ్చోడ సీఐ(87126 59936), గుడిహత్నూర్ ఎస్సై(87126 59946), నేరడిగొండ ఎస్సై(87126 59947), సిరికొండ ఎస్సై(87126 59948)ల వద్ద ఈ నెల 26 సాయంత్రం ఆరు గంటల వరకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

# బాధితురాలికి మెరుగైన వైద్యం అందిస్తున్నాం

### ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

**ఉట్నూరు, న్యూస్‌టుడే :** జైనూర్ ఘటన బాధితురాలికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అన్నారు. మంగళవారం మంత్రి సీతక్కతో కలిసి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. అనంతరం ఖానాపూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఇటీవల బాధ్యతలు చేపట్టిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి సన్మానించారు. పార్టీ నాయకులు ప్రభాకర్, నిసార్, అన్సార్ అలీ, ముబీన్ తదితరులు పాల్గొన్నారు.


టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, కాంగ్రెస్ నాయకులు


జిల్లా కార్యవర్గ సభ్యులతో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం

## తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యం

**ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే:** కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జిగా జాదవ్ శ్రవణ్ నాయక్, జిల్లా అధ్యక్షుడిగా సామల ప్రశాంత్, గౌరవాధ్యక్షుడిగా తుడం రాములు, ఉపాధ్యక్షులుగా ఎండీ రఫీక్, ఏనుగు రతన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నిమ్మల నరేందర్, సంయుక్త కార్యదర్శులుగా రామోజీ వీరాచారి, చాకటి కిరణ్ కుమార్, ఆంజనేయులు, కోశాధికారిగా దొంతుల ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా మామిడి మల్లారెడ్డి, శ్రీనివాస్, గెడం విఠల్, సలహాదారుగా సయ్యద్ సుజాత్ అలీ, భూపెల్లి శ్రీధర్, కోరెడ్డి కిషన్, న్యాయసలహాదారుగా గోసలు ఎన్నికయ్యారు. భూపెల్లి శ్రీధర్, గిమ్మ సంతోష్, సాయిచరణ్‌గౌడ్ తదితరులున్నారు.

### జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

**ఇచ్చోడ:** ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల సంఘం ఎన్నికను ఇచ్చోడలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఇచ్చోడ జూనియర్ కళాశాల హిందీ అధ్యాపకుడు సత్యనారాయణరావును ఎన్నుకున్నారు.

# నల్లబ్యాడ్జీలు ధరించి టోల్‌ప్లాజా కార్మికుల నిరసన

**జైనథ్, న్యూస్‌టుడే :** జైనథ్ మండలం పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టోల్‌ప్లాజా యూనియన్ సంతోష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామన్నారు. ప్రధాన కార్యదర్శి విలాస్, ఉపాధ్యక్షుడు పురుషోత్తం, సభ్యులు ప్రశాంత్‌రెడ్డి, ప్రభాకర్, మచ్చేందర్, రమేష్, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.


పిప్పర్‌వాడ: నిరసన తెలుపుతున్న టోల్‌ప్లాజా కార్మికులు

## 27న జాబ్‌మేళా

**ఎదులాపురం, న్యూస్‌టుడే:** నిరుద్యోగ యువకులకు ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించటానికి ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి మిల్కా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు రంగంలో సర్వీస్ అడ్వైజర్లు(డిప్లొమా ఇన్ బీటెక్), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్(ఆటోమొబైల్ ఇంజినీరింగ్), టెక్నీషియన్స్(ఎంబీఏ/మార్కెటింగ్), డెంటర్స్(ఐటీఐ), పెయింటర్స్(పదో తరగతి) ఉద్యోగాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

# ప్రతిభను వెలికితీసేందుకే క్రీడోత్సవాలు

**ఎదులాపురం, న్యూస్‌టుడే :** గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు గిరిజన క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని ఏటీడీఓ నిహారిక, జిల్లా గిరిజన క్రీడల అధికారి కే. పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం గిరిజన క్రీడోత్సవాలను ఏటీడీఓ నిహారిక జెండా ఊపి ప్రారంభించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 27న ఉట్నూరులో జరిగే జోనల్ స్థాయి గిరిజన క్రీడోత్సవాల్లో పాల్గొంటారన్నారు. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావు, పోటీల ఇన్‌ఛార్జి పవార్ లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు, పీడీలు రవీందర్, గోపాల్, శ్రీనివాస్, ప్రేంసింగ్, ఎండీ ఖాజీం తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న ఏటీడీఓ నిహారిక

## ఎంఈయూ శిక్షణ తరగతులు ప్రారంభం

**ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే :** రిమ్స్‌లో వైద్య విద్యార్థులకు మెరుగైన బోధన చేయడానికి బోధనా సిబ్బందికి మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ శిక్షణ తరగతులు మంగళవారం రిమ్స్‌లో ప్రారంభించారు. ఎన్ఎంసీ నిబంధనల మేరకు కౌన్సిల్ అనుమతితో మూడు రోజుల శిక్షణ తరగతులను రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాథోడ్ జైసింగ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్ఎంసీ పరిశీలకుడు రాజేంద్ర సర్పం, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

## స్మైల్ సొసైటీ సేవలు అభినందనీయం

**ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే :** స్మైల్ సొసైటీ చేస్తున్న సామాజిక కార్యక్రమాలు అభినందనీయమని రిమ్స్ సంచాలకుడు రాథోడ్ జైసింగ్ కొనియాడారు. అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయనతో పాటు మిత్రులు రక్తదానం చేయగా శిబిరాన్ని రిమ్స్ సంచాలకుడు ప్రారంభించారు.


రక్తదాన శిబిరంలో రిమ్స్ సంచాలకుడు రాథోడ్ జైసింగ్

## భారీగా గంజాయి పట్టివేత

**తలమడుగు, న్యూస్‌టుడే :** హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్న గంజాయిని ఆదిలాబాద్ జిల్లా తలమడుగు పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. పోలీసులకు ముందస్తుగా అందిన సమాచారంతో మండలంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద కాపుకాశారు. ఐచర్ వాహన డ్రైవర్ వాహనం ఆపకుండా పరారయ్యాడు. పోలీసులు వాహనాన్ని వెంబడించి మహారాష్ట్రలోని పిప్పల్‌గావ్ అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. అనంతరం వాహనాన్ని తలమడుగు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వాహనంలో దాదాపు 10 క్వింటాళ్లకు పైగా గంజాయి ఉన్నట్లు తెలిసింది. అది ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు. దాని వెనుకాల ఉన్నది ఎవరు అని పోలీసులు ఆరా తీస్తున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విచారణ చేపట్టారు. వివరాలను పోలీసులు వెల్లడించలేదు. ఈ విషయమై డీఎస్పీని సంప్రదించగా తర్వాత వెల్లడిస్తామని దాటవేశారు.


తలమడుగు పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన వాహనం

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి

**బేల, న్యూస్‌టుడే :** మండలంలోని పాటగూడ గ్రామానికి సరైన రహదారి, మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వీరి సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు లంకా రాఘవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆ గ్రామంలో పార్టీ గ్రామ శాఖ మహాసభలు నిర్వహించారు. నూతన శాఖ కార్యదర్శిగా తొడసం మోతీరాంను ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు తొడసం భీంరావు, పూసం సచిన్, ఆత్రం కిష్టన్న, గ్రామపటేల్ దేవురావు, శంబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న రాఘవులు

## కాలినడకన వచ్చి.. చాదర్ సమర్పించి

**భీంపూర్, న్యూస్‌టుడే:** అర్లి-టి శివారులో మంగళవారం జరిగిన కొంచావలి దర్గా జాతరలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పాల్గొన్నారు. కొద్దిదూరం కాలినడకన పయనించి దర్గాకు చేరుకుని చాదర్, పూలు సమర్పించారు. దర్గా వద్ద వసతులు మెరుగుపరుస్తామని హామీనిచ్చారు. భారాస నాయకులు తుల శ్రీనివాస్, సుధాకర్, నాగయ్య, సంతోష్, సంజీవ్‌రెడ్డి, లస్మన్న, రవూఫ్, రాకేష్, గంగయ్య, నితిన్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కన్నాల నవీన్ తదితరులు ఉన్నారు. భీంపూర్‌లో సహకార బ్యాంకును సందర్శించి రుణ మాఫీ వివరాలను మేనేజరును అడిగి తెలుసుకున్నారు.

## ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

**నార్నూర్, న్యూస్‌టుడే :** నార్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పథకాధికారి బాలాజీ కాంబ్లే, కళాశాల సిబ్బంది ఉదయ్‌కుమార్, వెంకటరమణ, నరేష్, సుజాత, పుష్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఉట్నూరు:** ఉట్నూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ధన్‌రాజ్, ప్రోగ్రాం ఇన్‌ఛార్జి లక్ష్మణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

**ఇచ్చోడ:** ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శంకర్ ప్రోగ్రాం అధికారి సత్యనారాయణరావు, ప్రభాకర్‌రెడ్డిలను సన్మానించారు. సోమేష్, ప్రభాకర్, బాలాజీ, గోవర్ధన్, భాస్కర్, శ్రీనివాస్, రాజేశ్వర్, మాధవి తదితరులు ఉన్నారు.

**బోథ్:** బోథ్‌లోని వాగ్దేవి జూనియర్, డిగ్రీ కళాశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ప్రిన్సిపాళ్లు ప్రవీణ్ రెడ్డి, విఠల్, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి కార్తిక్, అధ్యాపకులు నగేష్, ముత్యం, సతీష్, రాజేశ్వర్, ప్రసాద్, దత్తు, హరీశ్, పండరి తదితరులు పాల్గొన్నారు.

## జూదరుల అరెస్టు

**బోథ్, న్యూస్‌టుడే :** బోథ్ మండలం కన్గుట్టలో జూదం ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై ప్రవీణ్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం స్థావరంపై దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని, రూ.4,890 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రామ్మూర్తి పాల్గొన్నారు.

**జైనథ్:** జైనథ్ మండలం ఆనంద్‌పూర్, కూర, దీపాయిగూడ గ్రామాల్లో జూదమాడుతున్న 16 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం సిబ్బందితో కలిసి దాడిచేసి పట్టుకున్నామన్నారు.

### నాటుసారా విక్రయదారుల...

**బోథ్:** బోథ్ మండలం నిగినికి చెందిన ఇద్దరు మహిళలను, బాబెరకు చెందిన ఓ వ్యక్తిని మంగళవారం నాటుసారా విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఆబ్కారీ సీఐ జుల్ఫీకర్ అహ్మద్ పేర్కొన్నారు. అనంతరం బోథ్‌లో తహసీల్దార్ సుభాష్ చంద్ర ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# మల్లంపేటలో మహిళ దారుణ హత్య

### తెలిసిన వ్యక్తి పనేనంటున్న పోలీసులు!

**దుండిగల్, న్యూస్‌టుడే :** పట్టపగలు అపార్ట్‌మెంట్లోని ఓ ఫ్లాట్‌లో మహిళ దారుణ హత్యకు గురైన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మేడ్చల్ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. . ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరుకు చెందిన బొద్దుల సత్యనారాయణ, శారద(50) దంపతులు. వారికి ఇద్దరు సంతానం కాగా కుమార్తెకు వివాహమైంది. అయిదేళ్ల కిందట సత్యనారాయణ మృతి చెందాడు. ఆమె తన కుమారుడు సాయివినయ్‌తో కలిసి మల్లంపేట గ్రీన్ పార్క్ కాలనీ రోడ్డు నం.2 లో శ్రీ వంశీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్లో కొనుగోలు చేసిన ఫ్లాట్‌లో నెల రోజుల నుంచి ఉంటోంది. స్థానిక ప్రధాన రహదారి పక్కన విఘ్నేశ్వర మిల్క్ పాయింట్ పేరిట దుకాణం నిర్వహిస్తోంది.


శారద

ఆమె కుమారుడు నగరంలోని ఓ నిర్మాణ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం ఉదయం 8:40 గంటల ప్రాంతంలో తల్లిని మిల్క్ పాయింట్ వద్ద వదిలి విధులకు వెళ్లాడు. మిల్క్ పాయింట్ మూసి ఉందని అదే రోజు సాయంత్రం పలువురు కస్టమర్లు అతనికి ఫోన్ చేశారు. అతను పలుమార్లు తన తల్లికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో.. అపార్ట్‌మెంట్లోని తమ ఫ్లాట్ పక్కన ఉండే నరేశ్‌కు సమాచారం ఇచ్చాడు. నరేశ్ వెళ్లగా.. ప్రధాన ద్వారానికి బయట గడియ పెట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూంలో మంచంపై శారద విగతజీవిగా పడి ఉండటంతో కుమారుడికి సమాచారం అందించాడు. అతను ఇంటికి చేరుకుని చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. హత్య చేసిన వ్యక్తి ఆమె చెవి కమ్మలు, ముక్కుపుడక, రోల్డ్‌గోల్డ్ చైన్, సెల్‌ఫోన్ తీసుకెళ్లినట్లు కుమారుడు గుర్తించాడు. గదిలో రక్తపు మరకలు ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### పక్కా ప్రణాళికతో హత్య..

కుమారుడితో కలిసి ప్రతిరోజు ఉదయం మిల్క్ పాయింట్‌కి వెళ్లి తిరిగి రాత్రి 9 గంటల ప్రాంతంలో కుమారుడితో కలిసి శారద ఇంటికి వచ్చేది. సోమవారం ఉదయం దుకాణం తెరిచిన కొద్దిసేపటికే మూసివేసింది. 10 గంటల ప్రాంతంలో మాస్క్ ధరించిన గుర్తుతెలియని వ్యక్తితో కలిసి తన అపార్ట్‌మెంట్లోకి వెళ్తున్న దృశ్యాలు.. ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్ సీసీ కెమెరాలో నమోదయ్యాయి. గంట తర్వాత సదరు అపార్ట్‌మెంట్ నుంచి ఆ వ్యక్తి నడుచుకుంటూ వెళ్లిపోయాడు. మృతురాలికి ఫోన్ చేయకుండా వాట్సాప్ కాల్ చేసి మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు. ఊపిరి ఆడకుండా చేసి.. పక్కా ప్రణాళికతో హత్య చేశాడని పోలీసులు తెలిపారు. బంగారు ఆభరణాలు తీసుకునే క్రమంలో రక్తం కారినట్లు చెబుతున్నారు. చరవాణిని చౌటుప్పల్‌లో పడేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. స్థానికంగా సీసీ కెమెరాలు పరిశీలించగా హత్యచేసిన వ్యక్తి నడుచుకుంటూ మల్లంపేట బస్టాప్ వరకు వెళ్లినట్లు వెల్లడించారు.

### ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

**జైనథ్, న్యూస్‌టుడే:** ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి మినక జలంధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అడ, ముక్తాపూర్, నిరాల, బాలాపూర్ లేఖర్‌వాడ, పెండల్‌వాడ, కౌట, ఆనంద్‌పూర్, కూర, లక్ష్మీపూర్, జైనథ్, దీపాయిగూడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు చేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రామారావు, జిల్లా కార్యదర్శి రవీందర్‌రెడ్డి, నాయకులు స్వామి, సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

### సీనియర్ పాత్రికేయుడికి సన్మానం

**ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే :** సత్యశోధక సమాజ స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హిందీ భాషా సేవాసమితి ఆధ్వర్యంలో హిందీ పత్రిక సీనియర్ పాత్రికేయుడు సందేశ్ భరద్వాజ్‌ను సన్మానించారు. భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. హిందీ భాషా సేవాసమితి జిల్లా అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే, సభ్యులు సాంబన్న షిండే, చంద్రశేఖర్, జావెద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

### ఆక్రమణలను తొలగించకపోతే చర్యలు

**ఆదిలాబాద్ వైద్య విభాగం, ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే:** రిమ్స్ ప్రధాన ద్వారం ముందున్న ఆక్రమణలను తొలగించకపోతే చర్యలు తీసుకుంటామని రిమ్స్ సంచాలకుడు రాథోడ్ జైసింగ్, పురపాలక కమిషనర్ ఖమర్ అహ్మద్ హెచ్చరించారు. వారిద్దరు మంగళవారం ఆక్రమణలను పరిశీలించారు. టీపీఓ సుమలత, సిబ్బంది ఉన్నారు.

### ఏకలవ్య మోడల్ గురుకులంలో వైద్య శిబిరం

**ఇంద్రవెల్లి:** పాటగూడలోని ఏకలవ్య మోడల్ గురుకులం విద్యాలయంలో పిట్టబొంగరం పీహెచ్‌సీ వైద్యుడు ప్రతాప్‌సింగ్ నాయక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.

### వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

**ఇంద్రవెల్లి:** రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటంతో పాటు సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదనపు వైద్యాధికారి మనోహర్ అన్నారు. మంగళవారం ఇంద్రవెల్లి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్యుడు రాథోడ్ శ్రీకాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### దివ్యాంగులకు 50 శాతం రాయితీపై బస్ పాస్‌లు

**ఇంద్రవెల్లి:** ఆర్టీసీ డీఎం కల్పన ఆదేశాల మేరకు మండలంలోని సమాక కూడలి వద్ద ఆర్టీసీ అధికారులు దివ్యాంగులకు 50 శాతం రాయితీ బస్సు పాస్‌లను మాజీ సర్పంచి కొరెంగా సుంకట్‌రావు చేతుల మీదుగా అందజేశారు. దివ్యాంగుల సంఘం జిల్లా సమన్వయకర్త ప్రమోద్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ముత్యాల సురేష్, డివిజన్ అధ్యక్షుడు సోన్‌కాంబ్లె దేవిదాస్, ఆర్టీసీ కండక్టర్ ప్రకాశ్, దివ్యాంగులు పాల్గొన్నారు.

### భాజపా సభ్యత్వ నమోదు

**బజార్‌హత్నూర్:** భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం భాజపా నాయకులు నిర్వహించారు. భాజపాతోనే దేశ రక్షణ, అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్, నాయకులు రమణ, శంకర్, గణేష్, నర్సయ్య, రాకేష్, తదితరులు ఉన్నారు.

### కుష్ఠు రహిత సమాజానికి కృషి

**బజార్‌హత్నూర్:** కుష్ఠు రహిత సమాజానికి అంతా కృషి చేయాలని ఆ వ్యాధి నివారణ బృంద సభ్యులు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం ఆశా కార్యకర్తలు, తదితరులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి నివారణ జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు, స్థానిక వైద్యాధికారి భీంరావు ఉన్నారు.

### గంజాయి స్వాధీనం

**ఆదిలాబాద్ గ్రామీణం:** ఆదిలాబాద్ గ్రామీణ మండలం లాండసాంగ్వి గ్రామానికి చెందిన షేక్ చాంద్ గ్రామ శివారులో గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు గ్రామీణ ఎస్సై ముజాహిద్ తెలిపారు. గ్రామీణ ఎస్సై, సిబ్బందితో కలిసి షేక్ చాంద్‌ను తనిఖీ చేసి రూ.3 వేల విలువైన 30 గ్రాముల 7 చిన్న ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

## సంక్షిప్తం

### యోగా శిక్షకుల నియామకానికి ముఖాముఖి

**ఆదిలాబాద్ వైద్య విభాగం:** ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి ఆవరణలోని ఆయుష్ ఆసుపత్రిలో మంగళవారం యోగా శిక్షకుల నియామకానికి ఆ శాఖ నిర్వహించిన ఇంటర్వ్యూలకు 100 మందికిపైగా హాజరైనట్లు ఆర్‌డీడీ బి.ప్రమీలాకుమారి, ఏడీ పరమేశ్వర్‌నాయక్ తెలిపారు. దరఖాస్తులను స్వీకరించి ముఖాముఖి నిర్వహించారు. జిల్లా కార్యక్రమ అధికారిణి రాథోడ్ ప్రీతల్, వైద్యులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

**ఇచ్చోడ:** ఇచ్చోడలోని బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌ను మంగళవారం విజయ డెయిరీ మేనేజర్ దాస్రు నాయక్ సందర్శించారు. సోమవారం రైతులు ఆందోళన చేపట్టడంతో ఆయన సందర్శించినట్లు పేర్కొన్నారు. 4 నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇచ్చోడ పాడి రైతులకు రూ.6 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. త్వరలో ఖాతాలో జమవుతాయన్నారు.

### ఆయుష్ వైద్యాధికారుల నియామకాలు చేపట్టాలి

**ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే:** ఆయుష్ విభాగంలో వైద్యాధికారుల నియామకానికి విడుదల చేసిన ప్రకటన ఆధారంగా దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల చేసి నియామకాలు చేపట్టాలని పల్లె దవాఖానా డాక్టర్స్ అసోసియేషన్ వైద్యులు కోరారు. ఆదిలాబాద్‌కు మంగళవారం వచ్చిన ఆయుష్ ఏడీ పరమేశ్వర్‌నాయక్‌కు వారు ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ ఇక్రామ్‌ఉద్దీన్ తదితరులున్నారు.


ఆయుష్ ఏడీ పరమేశ్వర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న అభ్యర్థులు